క్లుప్తంగా

ఐఆర్ 15శాతం ప్రకటించాలి

విద్యారణ్యపురి: తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు మధ్యంతర భృతిని (ఐఆర్) 15శాతం ప్రకటించాలని బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ టీచర్స్ సెల్ చైర్మన్ తిరువరంగం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐఆర్‌ను కేవలం 5శాతంగా ప్రకటించటం అంటే ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ జోక్యం చేసుకొని ఐఆర్‌ను 15శాతానికి పెంచాలని సూచించారు. లేకుంటే సర్కారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు.

నాగయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకుడు ధర్మారపు నాగయ్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. శిరంశెట్టి కాంతారావు రచనలు – సమగ్ర పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ధర్మారపు నాగయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నాగయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

చిన్నారికి చేయూత

హన్మకొండ: విద్యుదాఘాతానికి గురై చికిత్స పొంది ఇంటికి చేరుకున్న చిన్నారికి ఎస్‌జేపీ సంస్థ ప్రతినిధులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. హనుమకొండ 10వ డివిజన్‌లోని మచిలీబజార్‌కు చెందిన బియాబాని నాజియా ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురికాగా తీవ్రగాయాలయ్యాయి. ఈక్రమంలో చిన్నారిని ఎస్‌జేపీ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సాగర్, కార్యదర్శి మొహమ్మద్ ముస్తాక్, నేహాల్, సభ్యులు కేతిడి దీపక్ రెడ్డి, షేక్ సర్వర్, శరత్‌రెడ్డి పరామర్శించి చేయూతనందించారు.

'ఘర్ - ఘర్ బీజేపీ'

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని 36వ డివిజన్ చింతల్ ఆర్ఎస్‌నగర్‌లో ఘర్ – ఘర్ మోదీ, ఘర్ – ఘర్ బీజేపీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కుసుమ సతీష్, ఆడెపు వెంకటేష్, రంజిత్, రఘునారెడ్డి, రాజు, శ్రీధర్, వీరస్వామి, నాగరాణి, విజయ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



హన్మకొండ: హనుమకొండ శ్రీనగర్ కాలనీ (సౌత్)లో వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో ఉచిత మహిళా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహిత పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ బచ్చు వీణ.. మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. వ్యాధులపై మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోషకాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా 237 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఔషధాలు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ 58వ డివిజన్ అధ్యక్షుడు కందేరావు నర్సింహరావు, నాయకుడు ఇమ్మడి రాజు, శ్రీనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎం.రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీ.అనిల్ కుమార్, ప్రతినిధులు ఎం.కుమారస్వామి, వీరభద్రయ్య, మాలకొండారెడ్డి, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేఏసీ దీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీలో అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ప్రశ్నించి ఆందోళన చేసిన విద్యార్థి సంఘాల నాయకులకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కొట్టించిన వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్య కేంద్రం ఆవరణలో విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారం 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పీహెచ్‌డీ అడ్మిషన్లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రెండో జాబితా కూడా విడుదల చేయాలని కోరారు. దీక్ష శిబిరంలో విద్యార్థి జేఏసీ నాయకులు అంబాల కిరణ్, మాచర్ల రాంబాబు, ఆరెగంటి నాగరాజు, ఎండీ.పాషా, అంకెళ్ల శంకర్, బొట్ల మనోహర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ధర్మసాగర్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను హనుమకొండ డీసీపీ మహ్మద్ అబ్దుల్‌బారి ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, సిబ్బంది విధుల నిర్వాహణ, మహిళా సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ స్వరూపరాణి



చీరలు పంపిణీ చేస్తున్న శ్రీమాన్, విద్యాసాగర్



బాపూజీనగర్‌లో కార్పొరేటర్ నర్సింగరావు



కాశిబుగ్గలో ఓని భాస్కర్, గోరంటల మనోహర్



చీరలు పంపిణీ చేస్తున్న అభినవ్ భాస్కర్

హన్మకొండ: నగరంలోని పలు డివిజన్లలో మహిళలకు బతుకమ్మ చీరలను ఆదివారం పంపిణీ చేశారు. అన్ని మతాల పండుగలకు ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి అన్నారు. హనుమకొండ టీవీ టవర్ కాలనీలోని తన స్వగృహంలో డివిజన్‌లోని మహిళలకు బతుకమ్మ చీరలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని అన్నారు. గ్రేటర్ వరంగల్ టౌన్ ప్రాజెక్టు అధికారి రాజేష్ కుమార్, రిటైర్డ్ ఎస్ఈ నల్ల సుధాకర్ రెడ్డి, ఆర్పీలు రాజేశ్వరి, శ్రీదేవి, స్వరూప, మంజుల, పద్మ, రమణి, రేణుక పాల్గొన్నారు.

5వ డివిజన్‌లో..

హన్మకొండ: హనుమకొండ 5వ డివిజన్‌లోని కొత్తూరు కమ్యూనిటీ హాల్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఆడపడుచులకు బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. అయితే, ఒక్కో చీరకు రూ.1,800 చొప్పున వెచ్చిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండడం హాస్యాస్పదం అని ఎద్దేవాచేశారు. బతుకమ్మ చీరల పంపిణీ ఓ కుంభకోణమని ఆరోపించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ చీరల పంపిణీపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో పండుగ సాగర్, అరవింద్, ఎండీ.షఫీ, రావుల సమ్మయ్య, సమ్మయ్య, మీనయ్య, మూల ప్రభాకర్, రాములు, సాయి, ప్రభాకర్, ఆర్పీలు హేమలత, శ్రీలత, శోభ, విజయ తదితరులు పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో..

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్‌లో బతుకమ్మ చీరలను ఆదివారం పంపిణీ చేశారు. మహిళలకు చీరలు స్థానిక కార్పొరేటర్ సంకు నర్సింగరావు అందజేసి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా అన్ని పండుగలకు సర్కారు సమ ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు దువ్వ కనకరాజు, నాయకులు మర్యాల కృష్ణ, మైలారం శంకర్, లక్ష్మణ్, సునంద్, శ్రీకాంత్, సాదిక్, సంజీవ, ఆర్పీలు పద్మ, నర్మద పాల్గొన్నారు.

కాశిబుగ్గలో..

కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గ స్వశక్తి భవన్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకునేందుకు సీఎం కేసీఆర్ చీరలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఆర్టీఏ మెంబర్ గోరంటల మనోహర్, ఈటల ఉమామహేందర్, వేముల నాగరాజు, నూకల రాణి, ఆర్పీలు సఫియా, కల్యాణి పాల్గొన్నారు.

60వ డివిజన్‌లో..

కాజీపేట: కాజీపేట 60వ డివిజన్ వడ్డెపల్లి ప్రణయ్ మార్గ్‌లో ఆదివారం మహిళలకు బతుకమ్మ చీరలను కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ పంపిణీ చేశారు. బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలకు కానుకగా చీరలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేశబోయిన అరుణ, శ్రావణ్ కుమార్, సమ్మయ్య, ఆర్పీ రజిత, ఏఈ శ్రీకాంత్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి రెయిలింగ్

- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు
- భయాందోళనలో బాటసారులు
- కొత్త గోడలు నిర్మించాలని వేడుకోలు



ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి రెయిలింగ్

కాజీపేట: రోడ్లు, భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం .. పట్టింపులేనితనం వల్ల కాజీపేట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి రెయిలింగ్ అత్యంత ప్రమాదకరంగా మారింది. దాదాపు నాలుగున్నర దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన బ్రిడ్జి గోడలు బీటలువారి ఎప్పుడు కూలి కింద పడుతాయో తెలియని దుస్థితి నెలకొంది. ప్రతిఏటా రూ.లక్షలాది ప్రభుత్వ నిధులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తూ పాత కాలం నాటి గోడలకే రంగులు వేసి అధికారులు మమ అనిపిస్తున్నారు తప్ప తాకితే గోడలను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శిథిలావస్థలో గోడలు

రైళ్లు, వాహనాల రాకపోకలతో బీటలువారిన గోడలు నిత్యం కంపిస్తున్నాయి. ముట్టుకుంటే కూలిపోయేలా ఉన్న గోడలను అధికారులు పరిశీలించి, తగు మరమ్మతులు చేయించాలి. లేకుంటే ఏదో ఒకరోజు పెను ప్రమాదం వాటిల్లుతుందని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి పక్క నుంచి నిత్యం రాకపోకలు సాగించే వెంకటాద్రినగర్ వాసులు.. బ్రిడ్జి గోడలు కూలి ఎక్కడ మీద పడుతాయేననే భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. పెను ప్రమాదం జరగకముందే అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పాత గోడలను కూల్చివేసి కొత్తగా నిర్మించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ



బీజేపీలో చేరిన వారితో భిక్షపతి, తదితరులు

హన్మకొండ: బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు మొలుగూరి భిక్షపతి అన్నారు. హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యాయలంలో పరకాల నియోజకవర్గం, పరకాల రూరల్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భిక్షపతి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ పరకాల రూరల్ మండలం అధ్యక్షుడు పుట్ట రవీందర్ ఆధ్వర్యంలో లక్ష్మీపురం, పోచారం గ్రామాలకు చెందిన 50 మంది బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాశికంటి రాజేంద్రప్రసాద్, దుబాసి వెంకటస్వామి, వడ్ల మహేందర్, కొర్ర శ్రీనివాస్, కొయ్యడ రమేష్, చిరంజీవి, వడ్ల మొగిలి, పుట్ట నరేష్, జన్ను ఓదెలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి



చెరువును పరిశీలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కాశిబుగ్గ: కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంగణంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. వేడుకలు నిర్వహించే చెరువు ప్రాంగణాన్ని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దూపం సంపత్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటిలాగే ఈసారి కూడా కాశిబుగ్గ దసరా ఉత్సవాలు, రావణ వధను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, బయ్యా స్వామి, కమిటీ ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, దసరా పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఆర్టీఏ మెంబర్ గోరంటల మనోహర్, కోశాధికారి గుత్తికొండ నవీన్, ఓంప్రకాష్ కోలారియా తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌నగర్ కాలనీ -2 కమిటీ ఎన్నిక



హన్మకొండ: 9వ డివిజన్‌లోని గణేష్‌నగర్ కాలనీ -2 అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో కాలనీ గౌరవ అధ్యక్షులుగా గుగులోత్ నారాయణసింగ్, ఎల్లావుల వెంకటస్వామి, కాగితపు చిదంబరం, అధ్యక్షుడిగా కోరబోయిన రవి, ప్రధాన కార్యదర్శిగా శంకర్, ఉపాధ్యక్షుడిగా మంచాల రాజు, కోశాధికారిగా విజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా రాజేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా ఇక్బాల్, సుధాకర్, అనిల్, ముత్తయ్య, రమేష్, కుమారస్వామి, రాజేశ్, రాకేష్ ఎన్నికయ్యారు.

రావణవధను వైభవంగా నిర్వహిస్తాం

ఖిలా వరంగల్: రంగశాయిపేటలోని మహంకాళి గుడి ఆవరణలో రావణ వధ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తామని దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ అన్నారు. రంగశాయిపేట మహంకాళి గుడి ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1983వ సంవత్సరం నుంచి రావణవధ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈసారి కూడా కమిటీ, దాతల సహాయ సహకారాలతో వైభవంగా సద్దుల బతుకమ్మ, దసరా, రావణ వధ కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో దామెరకొండ కరుణాకర్, రామమూర్తి, లక్ష్మయ్య, రామకృష్ణ ప్రసాద్, డాక్టర్ పోతు దర్శనం, చిమ్మని చంద్రమౌళి, పరికిపండ్ల రాజేశ్వర్‌రావు, వలుపదాసు రాజశేఖర్, కోట శ్రీధర్‌కుమార్, పాకాల మనోహర్, బజ్జూరి వీరేశం, పాలక రాజేందర్, ఎలుగు అశోక్, కత్తెరపల్లి వేణు, నవీన్‌కుమార్, దేవునూరి వెంకటేశ్వర్లు, ఆడెపు రఘు పాల్గొన్నారు.

ఆదుకునే ప్రభుత్వాన్ని ఆదరించండి

ఖిలా వరంగల్: భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన బాధితులను ఆదుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రైతులు ఆదరించాలని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఈమేరకు వరంగల్ ఖిలా వరంగ్ వాకింగ్ గ్రౌండ్ సమీపంలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో రూ.33 లక్షల పంట నష్టం చెక్కులను రైతులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, బోగి సురేష్, ఉమా దామోదర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, రైతులు పాల్గొన్నారు.

'పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగుల'కు సన్మానం



శ్రీకాంత్, ప్రశాంత్‌ను సన్మానిస్తున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు

హన్మకొండ: పోలీసు రిక్రూట్‌మెంట్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. హనుమకొండలోని టీఎస్ ఎమ్మార్పీఎస్ టీఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో కాజీపేట ఫాతిమానగర్ బాబు క్యాంపునకు చెందిన సోదరులిద్దరు పోలీసు రిక్రూట్‌మెంట్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా ఎడెల్లి శ్రీకాంత్, ఎడెల్లి ప్రశాంత్‌ను నాయకులు ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ ఖన్నా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి విజయకుమార్, జిల్లా అధికార ప్రతినిధి తాళ్లపల్లి ప్రశాంత్, జిల్లా కార్యదర్శి జోసెఫ్, నాయకులు గిన్నారాపు అనిల్ కుమార్, రాహుల్, గోపి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

2నుంచి జాతీయ మహాసభలు

న్యూశాయంపేట: బిహార్ పాట్నాలో నవంబర్ 2నుంచి 5వ తేదీ వరకు జరగనున్న బీకేఎంయూ (భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్) 15వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఈమేరకు మహా సభల వాల్‌పోస్టర్లను హనుమకొండ సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మోతె లింగారెడ్డి, ఎల్లేష్, లక్ష్మణ్, తిరుపతి, భిక్షపతి, రాజమణి, మహేందర్, రాజయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వరంగల్: వారంతా చిన్ననాటి స్నేహితులు.. ఒకే చోట చదువుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. వరంగల్ మహబూబియా ఉన్నత పాఠశాల 1997 –98వ బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలు, మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ విద్యా బుద్ధులు నేర్పిన గురువులు, సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నల్లెల అరుణ్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఖిలా వరంగల్: వరంగల్ త్రికోటలో అర్బన్ కోపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆదివారం పర్యటించారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు.

శ్వేతార్కాలయంలో సప్తవర్ణాభిషేక పూజలు



శ్వేతార్కుడికి అభిషేకం చేస్తున్న అనంత మల్లయ్య

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి నిత్యకల్యాణ మహోత్సవాన్ని అర్చకులు ఆదివారం నిరాడంబరంగా నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడి ఉత్సవ విగ్రహాలతో పాటు శ్వేతార్కుడికి సప్తవర్ణాభిషేకంతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు కొనసాగాయి. ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. కాశీ గంగా నది నుంచి భక్తులు తెచ్చిన నీటితో స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం, ఆలయ అన్నపూర్ణ భవనంలో భక్తులకు నిత్యాన్నదానం చేశారు.

కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా గుర్రం జ్యోతి



మడికొండ: వర్ధన్నపేట నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మడికొండ గ్రామానికి చెందిన గుర్రం జ్యోతిని నియమించినట్లు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, తదితరులకు జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని ఆమె కోరారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి అభినందన

హసన్‌పర్తి: స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన మిత్రుడిని బాల్య స్నేహితులు సన్మానించారు. హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991 – 92 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన ఎస్.రాజు.. చింతగట్టు పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గెజిటెడ్ హెడ్ మాస్టర్‌గా పదోన్నతిపై రేగొండ మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా హసన్‌పర్తిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాజును బాల్య స్నేహితులు అభినందించారు. కుమార్, శ్రీనివాస్, పార్థసారథి, రాజు, రవీందర్, అష్ఫద్, రామకృష్ణ, శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.

'ఇంటలెక్చువల్' సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న సుందర్‌రాజ్

న్యూశాయంపేట: పేదల సంక్షేమం కోసం మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం చేస్తున్న సేవలు అభినందనీయమని కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ అన్నారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో మెగా దూ – బ – దూ (ఉచిత వివాహ పరిచయ వేదిక)ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లిం యువతీ, యువకులు పరిచయ వేదికకు హాజరయ్యారు. ఫోరం కన్వీనర్ డాక్టర్ అనీస్ సిద్దిఖీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యులు నాస్రీన్, ఎంఏ.నయీం, డాక్టర్ రాజామాలిక్, సయ్యద్ అక్బర్, నదీమ్‌బేగ్, మాషూఖ్ రబ్బానీ, తాజొద్దీన్, నుశ్రత్, మెరాజ్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో మా డిమాండ్లను చేర్చండి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం బాధ్యులు

హన్మకొండ: సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం బాధ్యులు బీఆర్ఎస్, బీజేపీలను కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సిరికొండ మధుసూదనచారి, దాసోజు శ్రవణ్‌కుమార్, బీజేపీ మేనిఫెస్టో కమిటీ కన్వీనర్ మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మురళీధర్‌గౌడ్, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యులు మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, లింగయ్య, కత్తి వెంకటస్వామిని ఆయా పార్టీల కార్యాలయాల్లో ఆదివారం కలిసి మెమోరాండం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, డాక్టర్ లాలుకోట వెంకటాచారి, చొల్లేటి కృష్ణమాచార్యులు, రాగిఫణి రవీంద్ర, వీణవంక సదానందం తదితరులు ఉన్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి



ఆలయంలో పెళ్లి చేసుకున్న పత్రాన్ని చూపుతున్న శివకుమార్, హారిక

హన్మకొండ: ప్రేమించి పెండ్లి చేసుకున్న తమకు రక్షణ కల్పించాలని నవ వధువరులు కోరారు. ఈమేరకు ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఐనవోలు మండలం కొండపర్తికి చెందిన గుగ్గిళ్ల శివకుమార్, కాజీపేట మండలం భట్టుపల్లికి చెందిన జక్కుల హారిక చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. కలిసి చదువుకుని గ్రాడ్యుయేట్ పూర్తి చేశారు. ఈక్రమంలో తమ పెళ్లి ప్రస్తావన తీసుకురాగా, కులాలు వేరు కావడంతో అబ్బాయి తల్లిదండ్రులు ఒప్పుకోగా, అమ్మాయి తల్లిదండ్రులు మాత్రం ససేమిరా అన్నారు. దాంతో ఈనెల 4వ తేదీన చిల్పూరు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పెళ్లి చేసుకున్నారు. తమకు రక్షణ కల్పించాలని అదేరోజు సాయంత్రం ఐనవోలు పోలీసులకు విన్నవించుకున్నారు. అయితే, అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు అబ్బాయి ఇంటిపై దాడి చేశారు. ఈ విషయంపై ఐనవోలు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారిరువురు ఆవేదన వ్యక్తం చేశారు.

సమసిన ఐలమ్మ విగ్రహ వివాదం

కాజీపేట: ఇటీవల గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో అపహరణకు గురైన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహం ఎట్టకేలకు రజక సంఘం నాయకుల వద్దకు చేరింది. చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, సీపీ డాక్టర్ ఏవీ.రంగనాథ్ ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఏసీపీ డేవిడ్‌రాజ్ పర్యవేక్షణలో రజక సంఘం నాయకుల చెంతకు ఐలమ్మ విగ్రహం చేరింది.